RNI NO.TELTEL/2022/83842

# ప్రభాత గమనం

తెలుగు దినపత్రిక

PRABHATA GAMANAM

వరంగల్ | సంచిక 235 | సంపుటి 4 | శుక్రవారం | 15-05-2026 | పేజీలు 4 | వెల 3/-

## ఏసీబీకి చిక్కిన ఆర్ఐ

- దుగ్గొండి తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు..
- వారసత్వ భూమి వ్యవహారంలో రూ.10 వేల లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖకు దొరికిన ఆర్ఐ

04





- మావోయిస్టు ప్రభావిత ప్రాంతంలో వేగంగా రోడ్డు నిర్మాణం
- గిరిజన గ్రామాలకు చేరువగా వైద్యం, విద్య, రవాణా సౌకర్యాలు
- కర్రెగుట్టల్లో పర్యటించిన సీఆర్పీఎఫ్ ఏడీజీ రవిదీప్ సింగ్ సాహి, ములుగు ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

## అభివృద్ధి బాటలో కర్రెగుట్టలు

# శభాష్.. ములుగు పోలీస్..!

2

- భద్రతా బలగాల పర్యవేక్షణలో వేగంగా సాగుతున్న రోడ్డు నిర్మాణ పనులు
- తడపాల కొండల వరకు పూర్తికానున్న రహదారి
- అడవులు చీల్చుకుంటూ అభివృద్ధి అడుగులు.. మారుతున్న కర్రెగుట్టల రూపురేఖలు
- మోరుమూరు నుంచి తడపాల కొండల వరకు వేగంగా కొనసాగుతున్న రహదారి పనులు
- భద్రతతో పాటు అభివృద్ధిపైనా ప్రత్యేక దృష్టి సారించిన ములుగు పోలీసులు
- కష్టతర అటవీ ప్రాంతంలో సాహసోపేతంగా రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తున్న సిబ్బంది
- రహదారులతో ప్రభుత్వ సేవలు గిరిజన ప్రాంతాలకు మరింత చేరువ
- కర్రెగుట్టల అభివృద్ధిపై ఉన్నతాధికారుల సంతృప్తి
- సరిహద్దు గ్రామాల్లో అభివృద్ధి –భద్రత రెండింటికీ సమాన ప్రాధాన్యం
- రహదారుల నిర్మాణంతో గిరిజన ప్రాంతాల్లో కొత్త మార్పులు
- శాంతి భద్రతలతో పాటు మౌలిక వసతుల కల్పనలో ముందున్న ములుగు జిల్లా పోలీసులు

ఒకప్పుడు మావోయిస్టుల కంచుకోటగా, దట్టమైన అడవులు – ఎత్తైన కొండల మధ్య బయటి ప్రపంచానికి దూరంగా ఉన్న ములుగు జిల్లా కర్రెగుట్టలు ప్రాంతం ఇప్పుడు అభివృద్ధి బాటలో ముందుకు సాగుతోంది. దశాబ్దాలుగా రవాణా సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న గిరిజన గ్రామాలకు రహదారుల రూపంలో కొత్త జీవం పోసే ప్రయత్నాలు వేగవంతమయ్యాయి. అత్యంత క్లిష్టమైన భౌగోళిక పరిస్థితులు, భద్రతా సవాళ్ల మధ్య సైతం మోరుమూరు నుంచి పామునూరు, జెల్లా, దోలి మీదుగా తడపాల కొండల వరకు రహదారి నిర్మాణ పనులు దాదాపు పూర్తికావడం విశేషంగా మారింది. ఈ అభివృద్ధి పనులను గురువారం సీఆర్పీఎఫ్ దక్షిణ జోన్ అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ రవిదీప్ సింగ్ సాహి, ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ తో కలిసి పరిశీలించారు. అడవులను చీల్చుకుంటూ సాగుతున్న రహదారి పనుల పురోగతిపై అధికారులు సంతృప్తి వ్యక్తం చేస్తూ సిబ్బందిని అభినందించారు. ఈ రహదారులు పూర్తయితే గిరిజన గ్రామాలకు వైద్యం, విద్య, రవాణా, అత్యవసర సేవలు మరింత చేరువ కానుండటంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం అవుతాయని పేర్కొన్నారు. అభివృద్ధితో పాటు భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా కూడా అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. అనంతరం పామునూరు సీఆర్పీఎఫ్ క్యాంపులో నిర్వహించిన సమీక్ష సమావేశంలో సరిహద్దు ప్రాంత భద్రత, మావోయిస్టు వ్యతిరేక చర్యలు, భద్రతా బలగాల సమన్వయం, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై విస్తృతంగా చర్చించారు.

— ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో




2

### నాలుగు గంటల్లోనే

## చోరీ కేసు ఛేదన

- సీసీ కెమెరాలు, సాంకేతిక ఆధారాలతో నిందితుడి అరెస్ట్
- ఐదు ట్యాబ్‌లు చోరీ చేసిన వ్యక్తిని చాకచక్యంగా పట్టుకున్న పోలీసులు
- ఆపిల్ ఐప్యాడ్‌లు, లెనోవో ట్యాబ్ స్వాధీనం
- ఫిర్యాదు అందిన వెంటనే రంగంలోకి ప్రత్యేక బృందాలు
- వేగవంతమైన దర్యాప్తుతో కేసు పరిష్కరించిన కేయూసీ పోలీస్ టీమ్

### అర్బన్ ఛాలెంజ్ ఫండ్‌తో

## అభివృద్ధికి ఊతం

- అర్బన్ ఛాలెంజ్ ఫండ్ అమలుపై అధికారులతో కలెక్టర్ సమీక్ష
- నగర అభివృద్ధికి ప్రత్యేక నిధుల వినియోగంపై దిశానిర్దేశం
- భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించిన కలెక్టర్
- యుద్ధ ప్రాతిపదికన డీపీఆర్ సిద్ధం చేయాలని ఆదేశాలు
- నగర డ్రైనేజీ సమస్యల శాశ్వత పరిష్కారమే లక్ష్యం
- వీసీ ద్వారా మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం



2



3

### ప్రభుత్వ బడులను

## బలోపేతం చేయాలి

- ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సమిష్టి కృషి అవసరం
- బడిబాట కార్యక్రమంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి పిలుపు
- ప్రతి చిన్నారిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడమే లక్ష్యం
- 100 శాతం నమోదు సాధనపై ప్రత్యేక దృష్టి
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి తెలంగాణ పబ్లిక్ స్కూల్స్
- బడిబాట ద్వారా విద్యా చైతన్యానికి శ్రీకారం
- అర్వపల్లిలో బడిబాట పోస్టర్ ఆవిష్కరించిన ఎంపీ వేం

# శభాష్ ములుగు పోలీస్..!

## అభివృద్ధి బాటలో కర్రెగుట్టలు



- మావోయిస్టు ప్రభావిత అటవీ ప్రాంతంలో వేగంగా రహదారి నిర్మాణం
- గిరిజన గ్రామాలకు చేరువవుతున్న వైద్యం, విద్య, రవాణా సౌకర్యాలు
- కర్రెగుట్టల పర్యటనలో సీఆర్పీఎఫ్ ఏడీజీ రవిదీప్ సింగ్ సాహి, ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్
- భద్రతా బలగాల పర్యవేక్షణలో వేగంగా సాగుతున్న రోడ్డు నిర్మాణ పనులు
- తడపాల కొండల వరకు పూర్తికానున్న రహదారి
- అడవులు చీల్చుకుంటూ అభివృద్ధి అడుగులు.. మారుతున్న కర్రెగుట్టల రూపురేఖలు
- మోరుమూరు నుంచి తడపాల కొండల వరకు వేగంగా కొనసాగుతున్న రహదారి పనులు
- భద్రతతో పాటు అభివృద్ధిపైనా ప్రత్యేక దృష్టి సారించిన ములుగు పోలీసులు
- కష్టతర అటవీ ప్రాంతంలో సాహసోపేతంగా రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తున్న సిబ్బంది
- రహదారులతో ప్రభుత్వ సేవలు గిరిజన ప్రాంతాలకు మరింత చేరువ
- కర్రెగుట్టల అభివృద్ధిపై ఉన్నతాధికారుల సంతృప్తి
- సరిహద్దు గ్రామాల్లో అభివృద్ధి –భద్రత రెండింటికీ సమాన ప్రాధాన్యం
- రహదారుల నిర్మాణంతో గిరిజన ప్రాంతాల్లో కొత్త మార్పులు
- శాంతి భద్రతలతో పాటు మౌలిక వసతుల కల్పనలో ముందున్న ములుగు జిల్లా పోలీసులు

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో:**

దశాబ్దాలుగా అభివృద్ధికి దూరంగా ఉన్న ములుగు జిల్లా – ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అటవీ ప్రాంతమైన కర్రెగుట్టలు ఇప్పుడు మార్పు దిశగా అడుగులు వేస్తోంది. ఒకప్పుడు మావోయిస్టుల కంచుకోటగా పేరుగాంచిన ఈ ప్రాంతంలో ప్రస్తుతం రహదారి నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతుండగా, గిరిజన ప్రజల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. అడవులు, కొండలు, ప్రమాదకర మార్గాల మధ్య కొనసాగుతున్న ఈ అభివృద్ధి పనులకు భద్రతా బలగాలు అండగా నిలుస్తుండటం విశేషం. గురువారం సీఆర్పీఎఫ్ దక్షిణ జోన్ అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ రవిదీప్ సింగ్ సాహి, ములుగు జిల్లా ఎస్పీ సుధీ ర్ రాంనాథ్ కేకన్‌తో కలిసి కర్రెగుట్టలు ప్రాంతాన్ని సందర్శించి రహ దారి నిర్మాణ పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. అత్యంత క్లిష్ట మైన భౌగోళిక పరిస్థితుల్లో కూడా పనులు వేగంగా సాగుతున్న తీరు పై అధికారులు సంతృప్తి వ్యక్తం చేస్తూ సిబ్బందిని అభినందించారు.

### తడపాల కొండల వరకు పూర్తికానున్న రహదారి

మోరుమూరు నుంచి పామునూరు, అక్కడి నుంచి జెల్లా, డోలి మీదుగా తడపాల కొండల వరకు రహదారి నిర్మాణ పనులు దాదాపు పూర్తికావడం విశేషమని అధికారులు పేర్కొన్నారు. భారీ యంత్రాలు సైతం చేరలేని దట్టమైన అటవీ ప్రాంతాల్లో భద్రతా బలగాల సహకారంతో రహదారులు నిర్మించడం సాహసోపేత చర్యగా అభివర్ణించారు. ఇప్పటి వరకు వర్షాకాలంలో పూర్తిగా బయటి ప్రపంచానికి దూరమయ్యే ఈ గ్రామాలు, రహదారి నిర్మాణంతో అన్ని కాలాల్లో రాకపోకలకు అనుకూలంగా మారనున్నాయి. దీంతో గిరిజన ప్రజల జీవన ప్రమాణాల్లో గణనీయమైన మార్పు వస్తుందని అధికారులు తెలిపారు.

### గిరిజనులకు చేరువవుతున్న మౌలిక సదుపాయాలు

ఈ రహదారుల నిర్మాణంతో అత్యవసర వైద్య సేవలు, విద్యా సదుపాయాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు గిరిజన గ్రామాలకు వేగంగా చేరనున్నాయని అధికారులు పేర్కొన్నారు. ఇప్పటి వరకు అనారోగ్య పరిస్థితుల్లో అడవులు దాటి మైళ్ల దూరం నడవాల్సి వచ్చేదని, ఇప్పుడు అంబులెన్స్ సేవలు కూడా గ్రామాల వరకు చేరుకునే పరిస్థితి ఏర్పడుతోందని వివరించారు. అలాగే విద్యార్థులకు పాఠశాలలకు వెళ్లడం సులభమవుతుందని, గర్భిణులు, వృద్ధులకు వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం కావడంతో పాటు ప్రభుత్వ యంత్రాంగం గ్రామాల వరకు సులభంగా చేరగలదని అభిప్రాయపడ్డారు.

### భద్రత –అభివృద్ధి రెండూ సమాంతరంగా

అనంతరం అధికారులు పామునూరు సీఆర్పీఎఫ్ క్యాంపును సందర్శించి భద్రతా పరిస్థితులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సరిహద్దు ప్రాంత భద్రత, మావోయిస్టు వ్యతిరేక చర్యలు, భద్రతా బలగాల సమన్వయం మరియు అభివృద్ధి కార్యక్రమాల అమలుపై విస్తృతంగా చర్చించారు. అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా జరిగితేనే ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందని, అదే సమయంలో భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని అధికారులు అభిప్రాయపడ్డారు. ఈ పర్యటనలో హైదరాబాద్ రేంజ్ డీఐజీ అనిల్ మింజ్, 81 బెటాలియన్ కమాండెంట్ ముఖేష్ కుమార్ సింగ్, 39 బెటాలియన్ సెకండ్ ఇన్ కమాండ్ పంచం లాల్, జాంగ్‌షేర్ పాల్గొన్నారు. స్థానిక పోలీస్ అధికారులైన వెంకటాపురం సీఐ ముత్యం రమేష్, ఎస్సై తిరుపతి రావు తదితరులు రహదారి పనుల పురోగతిని అధికారులకు వివరించారు.



# ధాన్య కొనుగోళ్లను పరిశీలించిన ఇన్‌స్పెక్టర్

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్య కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా, సక్రమంగా కొనసాగాలని హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ (ఐఓపి) ఏ. మహేందర్ సూచించారు. గురువారం హసన్‌పర్తి మండలంలోని మడిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్య కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి అక్కడ జరుగుతున్న కొనుగోలు కార్యకలాపాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రంలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు విధానం, తూకం ప్రక్రియ, నిల్వ సదుపాయాలు, నాణ్యతా ప్రమాణాల తనిఖీలు తదితర అంశాలను ఆయన పరిశీలించారు. రైతులతో నేరుగా మాట్లాడి వారికి ఎదురవుతున్న సమస్యలను తెలుసుకున్నారు. ముఖ్యంగా ధాన్యం తూకంలో ఆలస్యం లేకుండా చూడాలని, రైతులకు సమయానికి చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో పని చేస్తున్న సిబ్బందితో సమావేశమైన ఇన్‌స్పెక్టర్ మహేందర్, రైతులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. రైతుల సంక్షేమం ప్రభుత్వ ప్రాధాన్యత అని, వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రంలో భద్రతా ఏర్పాట్లు, ధాన్యం నిల్వ విధానం, రవాణా అంశాలను కూడా ఆయన పరిశీలించారు. రైతులు ఎలాంటి మధ్యవర్తులపై ఆధారపడకుండా నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని విక్రయించాలని సూచించారు. ఇన్‌స్పెక్టర్ మహేందర్ ఆకస్మిక తనిఖీతో అధికారులు, సిబ్బంది అప్రమత్తమై కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేశారు. రైతులు కూడా అధికారుల స్పందనపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏపీఎం దాసరి నారాయణ మాట్లాడుతూ, మడిపల్లి ఐకేపీ ధాన్య కొనుగోలు కేంద్రంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టామని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాల ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామని, రైతులకు పారదర్శకంగా సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. రైతులు ధాన్యాన్ని నేరుగా కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలని సూచించారు. అలాగే రైతులకు చెల్లింపులు త్వరితగతిన జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇన్‌స్పెక్టర్ మహేందర్ మాట్లాడుతూ.. రైతులు దేశానికి వెన్నెముకలని, వారి కష్టానికి తగిన గౌరవం దక్కేలా ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పని చేయాలని అన్నారు. ధాన్య కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి అక్రమాలు, ఆలస్యాలు చోటుచేసుకోకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైతులు ఎవరైనా సమస్యలను ఎదుర్కొంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని, వారికి పూర్తి సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, కొనుగోలు ప్రక్రియను మరింత సులభతరం చేసేందుకు చర్యలు కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రంజిత్, కాంగ్రెస్ నాయకులు చిర్ర విజయ్ కుమార్, మాజీ వార్డు సభ్యులు కాందారి రమేష్, ఐకేపీ సిబ్బంది, సంబంధిత అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# మొబైల్ మ్యూజియం

- ప్రారంభించిన కలెక్టర్ చాహాత్ బాజ్ పాయ్
- తెలంగాణ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు

**హనుమకొండ, మే 14(ప్రభాత గమనం) :**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా తెలంగాణ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పర్యాటక మొబైల్ మ్యూజియాన్ని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహాత్ బాజ్‌పాయ్ గురువారం ప్రారంభించారు. హనుమకొండ కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ మొబైల్ మ్యూజియం మూడు రోజుల పాటు ప్రజలకు అందుబాటులో ఉండనున్నట్లు అధికారులు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలకు సంబంధించిన ఛాయాచిత్రాలు, ప్రత్యేక ప్రదర్శనలు ఈ మ్యూజియంలో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి.పర్యాటక ప్రాంతాల విశేషాలు, సందర్శనకు సంబంధించిన సమాచారం, పర్యాటకులకు అవసరమైన బ్రోచర్లు, సమాచార పుస్తకాలను కూడా మ్యూజియంలో అందుబాటులో ఉంచారు. రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, పర్యాటక రంగాన్ని మరింతగా ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ మొబైల్ మ్యూజియాన్ని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రెజరీ అధికారి ఎ. శ్రీనివాస్ కుమార్, ఎన్ఐసీ అధికారి శ్రీధర్, జిల్లా పౌర సంబంధాల అధికారి ఎం.డి. అయూబ్ అలీ, టీజీవో అధ్యక్షుడు జగన్ మోహన్, రాజేష్, ప్రవీణ్ కుమార్, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది, సందర్శకులు తదితరులు పాల్గొన్నారు.








# ప్రజల విశ్వాసమే పోలీస్ శాఖకు బలం

- అధికారీలు అంకితభావంతో పనిచేయాలి
- వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

పోలీస్ అధికారులు ప్రజలకు సేవాభావంతో, అంకిత భావంతో విధులు నిర్వహిస్తూ ప్రజల అభిమానాన్ని సంపాదించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ సూచించారు. బాధితులకు తక్షణ న్యాయం అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు పోలీస్ స్టేషన్‌పై ప్రజల్లో విశ్వాసం పెంపొందించే విధంగా అధికారులు వ్యవహరించాలని ఆయన పేర్కొన్నారు. వరంగల్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు హసన్‌పర్తి, కాజీపేట పోలీస్ స్టేషన్లకు నూతన ఇన్‌స్పెక్టర్లుగా బాధ్యతలు స్వీకరించిన ఇన్‌స్పెక్టర్లు మహేందర్, శ్యాంసుందర్ గురువారం సీపీ క్యాంపు కార్యాలయంలో పోలీస్ కమిషనర్‌ను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు కమిషనర్‌కు పూల మొక్కను అందజేసి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, పోలీస్ శాఖపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రతి అధికారిపై ఉందన్నారు. స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడిని గౌరవంగా పలకరించి వారి సమస్యలను ఓర్పుతో వినాలని సూచించారు. బాధితుల ఫిర్యాదులపై వెంటనే స్పందిస్తూ చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, కేసుల విచారణలో పారదర్శకత పాటించాలని పేర్కొన్నారు. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండే విధంగా పనిచేస్తూ, శాంతి భద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా వ్యవహరించాలని ఆయన సూచిం చారు. మహిళలు, వృద్ధులు, చిన్నారుల సమస్యలపై ప్ర త్యేక దృష్టి సారించాలని, సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెంచాలని దిశానిర్దేశం చేశారు. పోలీస్ స్టేషన్ అనేది ప్రజలకు న్యాయం అందించే కేంద్రంగా ఉండా లని, అక్కడికి వచ్చే ప్రతి వ్యక్తికి భరోసా కలిగే విధంగా సిబ్బంది వ్యవహరించాలని కమిషనర్ తెలిపారు. నిజాయితీ, క్రమశిక్షణ, సేవా భావంతో పనిచేస్తే పోలీస్ శాఖకు మరింత గౌరవం పెరుగుతుందని అన్నారు. బాధ్యతలు చేపట్టిన ఇన్‌స్పెక్టర్లు తమ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తామని కమిషనర్‌కు హామీ ఇచ్చారు.




# నాలుగు గంటల్లోనే చోరీ కేసు ఛేదన

- ఐదు ఐప్యాడ్ లతో నిందితుడు అరెస్ట్

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

హనుమకొండలో జరిగిన ఐదు ట్యాబ్‌ల చోరీ కేసును కేవలం నాలుగు గంటల్లోనే ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేసినట్లు కేయూసీ పోలీసులు వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జాగదీష్ పరమేశ్వర్ (34) అనే వ్యక్తి బుధవారం రాత్రి సమయంలో ఐదు ట్యాబ్‌లను చోరీ చేసినట్లు సమాచారం. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు వెంటనే దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరా ఫుటేజ్, సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితుడిని గుర్తించిన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుంచి నాలుగు ఆపిల్ ఐప్యాడ్‌లు, ఒక లెనోవో ట్యాబ్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును ఛేదించడంలో కేయూసి ఇన్‌స్పెక్టర్ ఎస్. రవి కుమార్, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది కీలకంగా పనిచేశారు. వేగంగా కేసును పరిష్కరించిన పోలీసు బృందాన్ని ఉన్నతాధికారులు అభినందించారు.

# డీజీపీని కలిసిన వరంగల్ సీపీ

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**




తెలంగాణ రాష్ట్ర నూతన డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన సివి ఆనంద్ ను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ గురువారం హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా సీపీ సన్ ప్రీత్ సింగ్ డీజీపీకి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో కొనసాగుతున్న పోలీసింగ్ విధానం, శాంతిభద్రతల పరిస్థితి, ప్రజా భద్రత కోసం చేపడుతున్న చర్యలపై డీజీపీ సివి ఆనంద్ సీపీతో చర్చించినట్లు సమాచారం. కమిషనరేట్ పరిధిలో అమలవుతున్న వివిధ భద్రతా కార్యక్రమాలు, నేర నియంత్రణ చర్యలు, సాంకేతిక ఆధారిత పోలీసింగ్ విధానాలపై కూడా వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు శాఖ సమర్థవంతంగా పనిచేయాలని, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని డీజీపీ సూచించినట్లు తెలిసింది.

# అర్బన్ ఛాలెంజ్ ఫండ్‌తో నగర అభివృద్ధికి ఊతం

- వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్
- భూగర్భ డ్రైనేజీ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి

**హనుమకొండ, మే 14 (ప్రభాత గమనం):**

నగర మౌలిక వసతుల కల్పనలో భాగంగా 'అర్బన్ ఛాలెంజ్ ఫండ్' అమలుకు సంబంధించి జిల్లా కలెక్టర్ మరియు బల్దియా ప్రత్యేకాధికారి శ్రీమతి చాహత్ బాజ్‌పాయ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. గురువారం హైదరాబాద్ నుంచి కమిషనర్ ఫర్ డైరెక్టరేట్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (CDMA) డా. టి.కే. శ్రీదేవి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి ఆమె పాల్గొన్నారు.

### యూజీడీ వ్యవస్థపై సమీక్ష:

ఈ సందర్భంగా నగరంలో అత్యంత కీలకమైన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ (UGD) వ్యవస్థ ఏర్పాటుపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన నిధుల లభ్యత, అమలు చేసే విధానాలు మరియు పాటించాల్సిన నియమ నిబంధనలపై కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. యుద్ధ ప్రాతిపదికన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (DPR) సిద్ధం చేయాలని ఆదేశించారు.



### మౌలిక వసతులకు ప్రాధాన్యత:

అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద నగరానికి ప్రత్యేక నిధులు మంజూరు కానున్నాయని, వీటి ద్వారా పట్టణ మౌలిక సదుపాయాలను మరింత మెరుగుపరచవచ్చని అధికారులు వెల్లడించారు. ప్రధానంగా డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి ఈ నిధులు ఎంతో దోహదపడతాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ఎస్ఈ శ్రీనివాస్ రావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు (ఈఈలు) రవి కుమార్, సంతోష్ బాబు, మహేందర్, మాధవీలత మరియు కేడబ్ల్యూఎఫ్ ప్రతినిధి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



# బయ్యారం సీఐ ప్రశాంత్ బాబుకు ఘన సన్మానం

**బయ్యారం, మే 14 (ప్రభాత గమనం):**

బయ్యారం సర్కిల్ ఇన్స్పెక్టర్ (సీఐ)గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ప్రశాంత్ బాబును గౌరారం గ్రామ పంచాయతీ పాలకవర్గం గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసింది. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. గౌరారం గ్రామ సర్పంచ్ లలిత మహేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు సీఐను కలిసి గ్రామ పరిస్థితులు, స్థానిక సమస్యలు మరియు శాంతిభద్రతల అంశాలపై వివరించారు. ఈ సందర్భంగా సీఐ ప్రశాంత్ బాబు మాట్లాడుతూ.. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజల సహకారం ఎంతో అవసరమని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవలందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పాలకవర్గ సభ్యులతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వార్డు సభ్యులు మాందాటి శ్రీనివాస్, బానోత్ సెట్యా, గుండ్లపల్లి వీరభద్రం పాల్గొన్నారు. అలాగే గౌరారం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వట్టం సాంబశివరావు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు రావుల విష్ణు, నాయకులు ఉప్పుల రవి, నర్ర సంతోష్, వట్టం రమేష్ తదితరులు హాజరయ్యారు. మండలంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీఐకి స్థానిక నేతలు శుభాకాంక్షలు తెలపడంతో గౌరారం గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది.



# టీఆర్పీలో భారీగా చేరికలు..

- యువతకు ఆహ్వానం పలికిన రవి పటేల్

**జయశంకర్ భూపాలపల్లి మే14(ప్రభాత గమనం) :**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా రూరల్ పరిధిలోని టేకుమట్ల మండలం గరిమెళ్లపల్లి, కలికోట పల్లి గ్రామాల నుండి పెద్ద ఎత్తున యువత తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరారు. ఈ సందర్భంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు రవి పటేల్ ఆధ్వర్యంలో వారికి పార్టీ కండువాలు కప్పి ఘనంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ, తెలంగాణ రాజ్యాధికార పార్టీ నిరుపేద ప్రజల కనీస అవసరాలైన విద్య, వైద్యం వంటి అంశాలను కార్పొరేట్ స్థాయిలో ఉచితంగా ప్రజలకు అందించడమే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు తీన్మార్ మల్లన్న ప్రజల పక్షాన నిలబడి రాజకీయాల్లో ఒక పెద్ద మార్పు కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. తెలంగాణలోని బహుజన ప్రజలంతా పార్టీకి అండగా నిలుస్తున్నారని, ఈరోజు పార్టీలో చేరిన ప్రతి యువకుడు మరో 100 మందిని ప్రభావితం చేస్తూ భూపాలపల్లిలో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. పార్టీ విధి విధానాలకు కట్టుబడి, పార్టీ ఆదేశాలను పాటిస్తూ ప్రజల సమస్యలపై ప్రభుత్వాన్ని, అధికారులను నిలదీసి పేద ప్రజల కోసం నిరంతరం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన పుప్పాల శ్రీను, దాసరపు వంశీ, దాసరపు శ్రావణ్, కొలనీ రమేష్‌లను రవి పటేల్ అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రటరీ పిట్టల వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షుడు ఇనుగాల ప్రణయ్ రాజ్, కొత్త మహేష్‌తో పాటు పార్టీ గ్రామ కమిటీ కార్యకర్తలు, నాయకులు మరియు యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ షబ్బీర్ అలీ మాతృమూర్తి కన్నుమూత

**నెక్కొండ, మే14(ప్రభాత గమనం):**

తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ షబ్బీర్ అలీ మాతృమూర్తి గురువారం ఉదయం అనారోగ్యంతో కన్నుమూశారు. ఆమె మరణ వార్త వినగానే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ ఉపాధ్యాయుల్లో ఒక్కసారిగా విషాదం నెలకొంది. నల్గొండ జిల్లా శాలిగౌరారం మండలం ఆకారం గ్రామంలోని వారి స్వగృహానికి పార్థివ దేహాన్ని తరలించగా, రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి ఫోరం నాయకులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మాతృమూర్తి పార్థివ దేహానికి పూలమాలలు వేసి వారు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా టిపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భయ్యా శివరాజ్ మాట్లాడుతూ..షబ్బీర్ అలీ మాతృమూర్తి మరణం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఒక బలమైన ఉద్యమకారుడిని సమాజానికి అందించిన తల్లిని కోల్పోవడం చాలా బాధాకరం అని,ఈ కఠిన సమయంలో షేక్ షబ్బీర్ అలీ, వారి కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. మరణవార్త తెలిసిన వెంటనే వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, ఇతర ముఖ్య నాయకులు ఆకారం గ్రామానికి చేరుకుని షబ్బీర్ అలీని పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పిఐడిఏ రాష్ట్ర అధ్యక్షుడు కేతరాజు శంకర్, టిపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భయ్యా శివరాజ్, కోశాధికారి నవీన్,సాంస్కృతిక శాఖ రాష్ట్ర కార్యదర్శి తిరుమలేశ్,ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు చంద్రగిరి సునిల్ కుమార్,నల్గొండ జిల్లా అధ్యక్షులు మధుమూర్తి, సంజీవరెడ్డి, చిట్యాల మండల అధ్యక్షులు నర్రా భిక్షం రెడ్డి,కూనురు మధు,సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అలీ, జనగామ జిల్లా అధ్యక్షులు మహమ్మద్ యాకుబ్ పాష, వర్కింగ్ ప్రెసిడెంట్స్ సాయి, సునీల్, తదితరులు ఉన్నారు.

# ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలి

- అందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలి
- ఎంపీ వేం నరేందర్ రెడ్డి

**కేసముద్రం, మే14(ప్రభాత గమనం) :**



ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు ప్రజా ప్రతినిధులు యువజన సంఘాలు అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలు విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామస్తులు కృషి చేయాలని రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా మొదటి రోజైన గురువారం ఆయన స్వగ్రామమైన అర్పణపెల్లిలో బడిబాట పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వేం మాట్లాడుతూ...బడిబాట ప్రధాన లక్ష్యం పాఠశాల వయస్సు గల ప్రతి చిన్నారిని గుర్తించి సమీప ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడం 100% నమోదు సాధించడమేనని అన్నారు.ప్రభుత్వ పాఠశాలలలో అత్యుత్తమ ప్రతిభ నైపుణ్యం కలిగిన విద్యావంతులైన ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందిస్తున్నారని తెలిపారు. విద్యార్థులకు ప్రభుత్వం ఏకరూప దుస్తులు పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు కిడ్స్ రాగిజావ బ్రేక్ఫాస్ట్ నోట్ బుక్స్ తదితర సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నుండి తెలంగాణలోని అన్ని మండల కేంద్రాలలో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. దీంట్లో భాగంగా అన్ని పాఠశాలలో నర్సరీ నుండి పిసి వరకే కాకుండా ఉదయం విద్యార్థులకు బ్రేక్ఫాస్ట్ సాయంత్రం స్నాక్స్ బస్సు సౌకర్యం ల్యాబ్స్ విద్యార్థులకు సరిపడా గదులు భోజనశాలలో ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను ప్రజాప్రతినిధులు గ్రామస్తులకు విద్యార్థులు తల్లిదండ్రులకు తెలియజేసి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి కృషి చేయాలని ఆయన కోరారు. ప్రభుత్వ పాఠశాలలో నమోదు శాతాన్ని పెంచాలని ఆయన పేర్కొన్నారు. నమోదు శాతాన్ని పెంచి బలహీన వర్గాలకు నాణ్యమైన విద్యను అందేలా కృషి చేయాలని పేర్కొన్నారు.ఏ ఒక్క విద్యార్థి విద్యకు దూరం కాకుండా ఉండడానికి ప్రభుత్వం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గంట సంజీవరెడ్డి ఆర్టిఏ నెంబర్ రావుల మురళి, మండల పార్టీ అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్ రావు, మాజీ ఎంపీటీసీ బండారు దయాకర్, హెచ్ఎంలు కాట్రగడ్డ చంద్రశేఖర్, వాసిరెడ్డి రాజశేఖర్, ఉపాధ్యాయులు తుమికి వినోద్ రాజు, నెహ్రూ, సంపత్, సురేష్, రవీందర్, నాగయ్య, ప్రవీణ్, మహేష్, మురళి పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తా

- రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి..
- కేసముద్రం విలేకరుల డబుల్ బెడ్రూం ఇళ్ల విన్నపంపై సానుకూల స్పందన
- ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభం మీడియా:వేం

**కేసముద్రం, మే 14 (ప్రభాత గమనం ):**

సమాజ హితం కోసం నిరంతరం శ్రమిస్తున్న జర్నలిస్టుల సంక్షేమానికి తాము కట్టుబడి ఉన్నామని రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం మండలంలోని అర్పణపల్లి గ్రామ పర్యటనకు వచ్చిన ఆయనను కేసముద్రం మండల వివిధ పత్రిక లలో పనిచేసే పాత్రికేయులు మర్యాద పూర్వకంగా కలిసి, తమ చిరకాల వాంఛ అయిన రెండు పడకల ఇళ్ల మంజూరు కోరుతూ వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా విలేకరులు ఎంపీతో మాట్లాడుతూ.. "సమాజంలో జరిగే మంచి చెడులను నిరంతరం ప్రజలకు, ప్రభుత్వానికి చేరవేస్తూ వారధిలా పని చేస్తున్నామని క్షేత్రస్థాయిలో ఎంతో శ్రమ పడుతున్న మాకు ఇప్పటికీ సొంత ఇల్లు లేని పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో విలేకరులకు ప్రత్యేక కోటా కల్పించి ఇళ్లు మంజూరు చేయాలి" అని కోరారు.విలేకరుల విన్నపంపై ఎంపీ వేం నరేందర్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో నాలుగో స్తంభంగా విలేకరులు పోషిస్తున్న పాత్ర వెలకట్టలేనిదన్నారు. విలేకరుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. అర్హులైన ప్రతి విలేకరికి డబుల్ బెడ్రూమ్ ఇల్లు దక్కేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్థాయిల్లో పోరాడి, న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. తమ సమస్యపై సానుకూలంగా స్పందించి, హామీ ఇచ్చినందుకు ప్రెస్ క్లబ్ ప్రతినిధులు ఎంపీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, గంధసిరి యాకన్న, చాగంటి శ్రీనివాస్, మహేందర్, ఉమేష్, జున్ను శ్రీనివాస్,విక్రమ్,సతీష్ పాల్గొన్నారు.

# డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో 24 మందిపై కేసులు

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో**

వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంకెన్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 24 మందిని గురువారం కోర్టులో హాజరుపర్చినట్లు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ కె. సుజాత తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ఐపీఎస్, అదనపు డీసీపీ ఆర్. ప్రభాకర్ రావు, ఏసీపీ టి. సత్యనారాయణ పర్యవేక్షణలో నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిని గుర్తించారు. పట్టుబడిన వారిని గౌరవ మేజిస్ట్రేట్ రాజ్ నిధి, స్పెషల్ జేఎఫ్‌సీఎం అండ్ నాలుగవ అదనపు జేఎఫ్‌సీఎం సివిల్ జడ్జి, వరంగల్ కోర్టు ఎదుట హాజరుపర్చగా, ఏనుమాముల ప్రాంతానికి చెందిన కొంతం నాగరాజుకు రూ.500 జరిమానాతో పాటు రెండు రోజుల సామాజిక సేవ శిక్ష విధించారు. ఆయన్ను వరంగల్ ఆయుర్వేద ఆస్పత్రికి సామాజిక సేవ నిమిత్తం పంపించారు. మిగిలిన 23 మందికి మొత్తం రూ.26,100 జరిమానా విధించినట్లు అధికారులు తెలిపారు. అలాగే డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన మరో వ్యక్తిని కోర్టులో హాజరుపర్చగా, అతనికి రూ.1,000 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు వెల్లడించారు.



# గార్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా 'విద్యా వారోత్సవాలు'

**గార్ల, మే 14 (ప్రభాత గమనం) :**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో భాగంగా, గార్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యా వారోత్సవాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. కళాశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఈ ఉత్సవాల్లో భాగంగా, నాలుగవ రోజైన గురువారం (14.05.2026) కళాశాల ప్రాంగణంలో తల్లిదండ్రుల – ఉపాధ్యాయుల సమావేశం (PTM) మరియు పూర్వ విద్యార్థుల సమ్మేళనం వైభవంగా జరిగాయి.కళాశాల ప్రిన్సిపాల్ డా. డి. రాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆయన తల్లిదండ్రులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థుల విద్యాభివృద్ధి కేవలం తరగతి గదులకే పరిమితం కాకూడదని, వారి ప్రవర్తన మరియు క్రమశిక్షణపై తల్లిదండ్రులు కూడా నిరంతరం నిఘా ఉంచాలని కోరారు.విద్యార్థులు ప్రతిరోజూ కళాశాలకు హాజరయ్యేలా చూడాలని, బయోమెట్రిక్ (FRS) అటెండెన్స్ ప్రాముఖ్యతను వివరించారు.ప్రస్తుత కాలంలో స్మార్ట్ ఫోన్ల అతి వినియోగం విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీస్తోందని, అవసరానికి మించి ఫోన్లను వాడకుండా నియంత్రించాలని సూచించారు.యువత మాదకద్రవ్యాల (Drugs) బారిన పడకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని, వారి స్నేహ సంబంధాలను గమనిస్తూ ఉండాలని హెచ్చరించారు.అదేవిధంగా, కళాశాలలో నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమావేశం ఎంతో స్ఫూర్తిదాయకంగా సాగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ గారు మాట్లాడుతూ.. కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు చేదోడువాదోడుగా నిలవాలని పిలుపునిచ్చారు."ఈ కళాశాలలో చదివి, నేడు సమాజంలో ఉన్నత స్థానాల్లో స్థిరపడిన విద్యార్థులు ప్రస్తుత విద్యార్థులకు రోల్ మోడల్స్ (ఆదర్శం)గా నిలవాలి."కళాశాల నుంచి విద్యనభ్యసించి వివిధ రంగాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించిన పలువురు పూర్వ విద్యార్థులను ప్రిన్సిపాల్ గారు శాలువాలతో ఘనంగా సన్మానించారు. తమ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్న పూర్వ విద్యార్థులు, కళాశాల ప్రగతికి తమవంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, అధ్యాపకేతర సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వీరన్నపై చర్యలు తీసుకోవాలి

- సీహెచ్ శ్రీనివాస్, టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లాఅధ్యక్షుడు

**మహబూబాబాద్, మే14(ప్రభాత గమనం):**

జర్నలిస్ట్ సమాజం ఆత్మగౌరవానికి భంగం కలిగించేవిధంగా అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ పార్టీ డాక్టర్ సెల్ రాష్ట్రకార్యదర్శి డాక్టర్ వీరన్న నాయక్ పై కాంగ్రెస్ పార్టీ చర్యలు తీసుకోవాలని, జర్నలిస్ట్ లకు డాక్టర్ వీరన్న బహిరంగ క్షమాపణ చెప్పాలని టియుడబ్ల్యూజే (ఐజేయు) మహబూబాబాద్ జిల్లాఅధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈఅంశంపై కురవి మండల జర్నలిస్ట్ లతో గురువారం మాట్లాడిన అనంతరం జిల్లాప్రదాన కార్యదర్శి గాడిపల్లి శ్రీహరితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో రాష్ట్రస్థాయి పదవిలో ఉండి, బిజెపి ఎంపి తో కురవి ఆలయంలో పూజాకార్యక్రమంలో పాల్గొనడం, సెల్ఫీలు దిగడం డాక్టర్ వీరన్ననాయక్ బహిరంగంగానే చేసారన్నారు. ఇదే అంశాన్ని ప్రస్తావిస్తూ కురవి మండలానికి చెందిన జర్నలిస్ట్ సహదేవ్ వార్త రాసాడని,దానికి వివరణ ఇచ్చుకునే ప్రయత్నమో,లేదంటే ఎందుకు సెల్ఫీలు దిగాల్సివచ్చిందో తెలియజేయకుండా, తానే జర్నలిస్ట్ లపై సోషల్ మీడియాలో ప్రతిదాడికి దిగాడని, సహదేవ్ తోపాటు, జర్నలిస్ట్ లందరిని పలుచని చేసే విధంగా పోస్టింగ్ లు చేయడమేకాకుండా, జర్నలిస్ట్ ల సామాజిక గౌరవాన్ని, వృత్తిపరమైన విలువలను పట్టించుకోకుండా డాక్టర్ వీరన్న వ్యాఖ్యలు చేసారన్నారు. అయినప్పటికీ ఈ..విషయాన్ని వివాదం చేయకూడదని, కాంగ్రెస్ నాయకుల సమక్షంలోనే చర్చించాలని ఆలోచనతో కురవి మండల జర్నలిస్ట్ లు ప్రయత్నం చేసినా డాక్టర్ వీరన్న పద్ధతిలో మార్పురాలేదని, పార్టీ ముఖ్యనాయకులు చెప్పిన పట్టింపులేని దోరణితో వ్యవహరిస్తున్నాడని శ్రీనివాస్ అన్నారు. మార్పు రావాలని, చేసిన తప్పిదాన్ని తెలుసుకొవాలని, జర్నలిస్ట్ ల పట్ల చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని సిహెచ్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచందర్ నాయక్ జర్నలిస్ట్ లతో ఎంతో స్నేహపూర్వకంగా ఉంటారని వారి స్వంత నియోజకవర్గంలో కాంగ్రెస్ రాష్ట్రస్థాయి నాయకుని తీరు ఇలా ఉండడం విచారకరమని శ్రీనివాస్ తెలిపారు. సంఘటన జరిగి చాలారోజులైన ఇప్పటివరకు సంయమనంతోనే వ్యవహరించామని గుర్తుచేసారు. చేసిన తప్పును, పొరపాటు వ్యాఖ్యలను వెనక్కి తీసుకోనట్లయితే.., మొదట డోర్నకల్ నియోజకవర్గవ్యాప్తంగా, తర్వాత మహబూబాబాద్ జిల్లావ్యాప్తంగా టియుడబ్ల్యూజే(ఐజేయు) ఆద్వర్యంలో జర్నలిస్ట్ లను అందరిని కలుపుకొని నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని జిల్లాఅధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్, జిల్లాప్రదానకార్యదర్శి గాడిపల్లి శ్రీహరి హెచ్చరించారు.



# డిగ్రీ విద్యార్థి వద్ద గంజాయి పట్టివేత

- 128 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్న పోలీసులు

**వరంగల్ మే14(ప్రభాత గమనం):**

వరంగల్ మట్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయిస్తున్న ఓ డిగ్రీ విద్యార్థిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి 128 గ్రాముల గంజాయి, ఒక హోండా ఆక్టివా స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం... మట్వాడ ఎస్సై బి. శ్రీనివాస్ తన సిబ్బందితో కలిసి హంటర్ రోడ్డు ప్రాంతంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో ఏడు మోరీల జంక్షన్ వద్ద అనుమానాస్పదంగా ఉన్న ఓ యువకుడు పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించాడు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు అతడిని వెంబడించి పట్టుకున్నారు. తనిఖీ చేయగా అతని వద్ద ఉన్న కవరులో గంజాయి లభ్యమైంది.అరెస్ట్ అయిన యువకుడు శ్రీపతి మధన్ కుమార్ (21)గా గుర్తించారు. ఇతడు వరంగల్‌లోని ఓ ప్రైవేట్ కాలేజీలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. ములుగు జిల్లా గోవిందరావుపేటకు చెందిన మధన్ ప్రస్తుతం వరంగల్ ఆటో నగర్‌లో నివాసం ఉంటున్నట్లు పోలీసులు తెలిపారు.విచారణలో భాగంగా మధన్ కుమార్‌కు తన స్వగ్రామంలోనే స్నేహితుల ద్వారా గంజాయి అలవాటు ఏర్పడినట్లు, వ్యక్తిగత ఖర్చుల కోసం గంజాయి విక్రయించడం ప్రారంభించినట్లు ఒప్పుకున్నాడు. వరంగల్ డాక్టర్స్ కాలనీకి చెందిన వంగ భరత్ సాయి అనే వ్యక్తి ద్వారా గంజాయి కొనుగోలు చేస్తున్నట్లు వెల్లడించాడు.గత నెలలో తీసుకున్న 1.5 కిలోల గంజాయిలో మిగిలిన 128 గ్రాములను విక్రయించే ప్రయత్నంలో పట్టుబడ్డాడని పోలీసులు తెలిపారు. గంజాయిని క్లూస్ టీం సహాయంతో తూకం వేసి సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ ఆపరేషన్‌కు మున్సిపల్ అధికారులు (జిడబ్లూఎంసీ) సాక్షులుగా వ్యవహరించారు. నిందితుడిపై ఎండీపిఎస్ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు మట్వాడ పోలీసులు వెల్లడించారు. పరారీలో ఉన్న ప్రధాన సరఫరాదారు వంగ భరత్ సాయి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, గంజాయి విక్రయం లేదా రవాణా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

# రైతులకు ఇబ్బందులు రానివ్వొద్దు

- 25 కేంద్రాలకు 25 మంది ప్రత్యేక అధికారుల నియామకం
- జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్

**మహబూబాబాద్ మే14(ప్రభాత గమనం):**

మొక్కజొన్న రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం పకడ్బందీ చర్యలు తీసుకొని ముందుకు సాగుతుందని, జిల్లాలోని 25 కేంద్రాలకు 25 మంది ప్రత్యేక అధికారులను నియమించి కొనుగోలు చేసిన మక్కలను వెంటవెంటనే రైస్ మిల్లులకు గోదాములకు తరలించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్ ప్రధాన సమావేశం మందిరంలో మార్క్ఫెడ్, వ్యవసాయ, సహకార, పౌరసరఫరాలు, పోలీస్, 25 మంది కాక ప్రత్యేక అధికారులు, లారీ కాంట్రాక్టర్స్, అన్ని విభాగాల సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఏర్పాటు చేసిన (25) మక్కల కొనుగోలు కేంద్రాలను 25 మంది జిల్లాస్థాయి సీనియర్ అధికారులు ఎంపీడీవోలు తదితర విభాగాలకు చెందిన ఉన్నతాధికారులను నియమించి క్షేత్రస్థాయిలో వెంట వెంటనే చర్యలు తీసుకొని కొనుగోలు చేసిన మక్కలను సంబంధిత గుర్తించిన మిల్లులు, గోడౌన్స్ లకు తరలించడం జరుగుతుందని, లారీ కాంట్రాక్టర్స్ తోపాటు ఇతర సదుపాయాలు ట్రాక్టర్స్, డీసీఎం తదితర వాహనాల ద్వారా నిరంతరం షిఫ్టులవారీగా రౌండ్ ద క్లాక్ పనిచేయడం జరుగుతుందని అన్నారు. ఇప్పటికే జిల్లాలో 59.202 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని తరలించామని తెలిపారు. పోలీస్,




రవాణా శాఖ అధికారుల సమన్వయంతో గోదాములలో ఖాళీ ప్రదేశాలను గుర్తించి, స్వాధీనపరచుకొని మక్కలను వెంటవెంటనే షిఫ్ట్ చేయడం జరుగుతుందని అన్నారు. గురువారం తాను, జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటన చేశామని, ప్రత్యేక అధికారులు కూడా ప్రతినిత్యం క్షేత్రస్థాయిలో ఉంటూ సమీక్షించుకొని ఎలాంటి ఆటంకాలు రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ధాన్యం, మక్కల కొనుగోళ్ల నిర్వహణపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో డీఆర్డీఓ ప్రాజెక్ట్ అధికారి మధుసూదన రాజు, జెడ్పీ సీఈవో పురుషోత్తం, ఆర్డీవో కృష్ణవేణి, అధికారులు పాల్గొన్నారు.



# విద్యాసంస్థల బలోపేతానికే 'విద్యా వారోత్సవాలు'

- మన ఊరు - మన బడి లక్ష్యంగా ముందుకు సాగుదాం
- మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి

**కేసముద్రం మే 14: (ప్రభాత గమనం):**

ప్రభుత్వ విద్యాసంస్థల పటిష్టత, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం 'విద్యా వారోత్సవాలను' ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి అన్నారు. కల్వలతో పాటు పలు గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించిన 'ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక' విద్యా వారోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ వేల్పుకొండ సుజాత మాట్లాడుతూ..ప్రస్తుత ప్రజాపాలనలో అన్ని రంగాల కంటే విద్యారంగానికే ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని, గ్రామాల్లోని ప్రతి బిడ్డ బడికి వెళ్లేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆమె పిలుపునిచ్చారు.కార్యక్రమంలో పాల్గొన్న వార్డు సభ్యులు మాట్లాడుతూ.. 'బడిబాట' కార్యక్రమం ద్వారా బడి మానేసిన విద్యార్థులను గుర్తించి, తిరిగి వారిని విద్యా వ్యవస్థలోకి తీసుకురావడానికి ఇదొక మంచి అవకాశమని కొనియాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించేలా ఈ వారోత్సవాలు స్ఫూర్తినిస్తాయని వారు పేర్కొన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపు,అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు గ్రామ ప్రముఖులు.విద్యాసంస్థల అభివృద్ధికి నిరంతరం సహకారం అందించడం జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, వార్డు సభ్యులు మరియు విద్యా కమిటీ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సీపీఎంలో 'లంబాడ' చిచ్చు

- మహబూబాబాద్ లో ఎర్రకోటకు బీటలు?
- పార్టీలో కలకలం రేపిన హరినాయక్ రాజీనామా

**గార్ల, మే 2026 (ప్రభాత గమనం) :**

సిద్ధాంతాలకు పెట్టింది పేరుగా చెప్పుకునే సిపిఎం (CPM) పార్టీలో ఇప్పుడు 'వ్యక్తిగత ఆధిపత్యం' రాజ్యమేలుతోంది. మహబూబాబాద్ జిల్లాలో ఆ పార్టీ పరిస్థితి ఇప్పుడు "పైకి ఎర్రజెండా.. లోపల వ్యక్తిగత ఎజెండా" అన్నట్లుగా తయారైంది. తాజాగా జిల్లా గిరిజన సంఘం సెక్రటరీ, పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు హరి నాయక్ రాజీనామాతో జిల్లా రాజకీయాల్లో ఒక్కసారిగా కలకలం రేగింది.పార్టీలోని కొందరు అగ్రనేతల తీరుపై కిందిస్థాయి కార్యకర్తలలో తీవ్ర అసహనం వ్యక్తమవుతోంది. కేవలం ఇద్దరు నేతల కనుసన్నల్లోనే జిల్లా యంత్రాంగం నడుస్తోందని, నిబద్ధతతో పనిచేసే వారిని కేవలం 'బానిసలు'గా చూస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సిద్ధాంతాల ముసుగులో కార్యకర్తల శ్రమను అడ్డం పెట్టుకొని సదరు నేతలు కోట్లు గడిస్తున్నారన్న విమర్శలు పార్టీ ఉనికినే ప్రశ్నార్థకం చేస్తున్నాయి.జిల్లాలో కీలకమైన లంబాడ సామాజిక వర్గానికి చెందిన నేతలను కావాలనే అణచివేస్తున్నారనే చర్చ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.గత ఏడాది కాలంగా వరుసగా లంబాడ సామాజిక వర్గానికి చెందిన యువ నేతలు పార్టీని వీడుతుండటం యాదృచ్ఛికం కాదని, ఇది ఒక పద్ధతి ప్రకారం జరుగుతున్న 'రాజకీయ కుట్ర' అని హరి నాయక్ వర్గీయులు ఆరోపిస్తున్నారు.కింది స్థాయి నుండి పార్టీని నిర్మించిన నేతలను గౌరవించకపోగా, వారిని మానసిక క్షోభకు గురిచేసి బయటకు వెళ్లేలా చేస్తున్నారనే వాదన వినిపిస్తోంది."పార్టీ అంటే క్రమశిక్షణ.. సిద్ధాంతం" అనేది ఒకప్పటి మాట. కానీ ఇప్పుడు మహబూబాబాద్ సిపిఎంలో వ్యక్తిగత నిర్ణయాలదే పైచేయి అవుతోంది. ప్రజా సమస్యల కంటే స్వప్రయోజనాలకే పెద్దపీట వేస్తుండటంతో, ఉత్సాహవంతులైన యువత పార్టీకి దూరమవుతున్నారు. యువ నాయకత్వాన్ని ప్రోత్సహించడంలో జిల్లా అగ్ర నాయకత్వం పూర్తిగా విఫలమైందనేది స్పష్టమవుతోంది.జిల్లాలో పార్టీ ఉనికి కోల్పోయే ప్రమాదం ఉన్నా, రాష్ట్ర నాయకత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా అధిష్టానం జోక్యం చేసుకుని, ఏకపక్ష నిర్ణయాలకు పాల్పడుతున్న నేతలకు అడ్డుకట్ట వేయకపోతే.. మహబూబాబాద్ జిల్లాలో ఎర్రజెండా కనుమరుగయ్యే రోజులు దగ్గరలోనే ఉన్నాయని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.ఒకప్పుడు ఉద్యమాల గడ్డగా ఉన్న మహబూబాబాద్‌లో, అంతర్గత కుమ్ములాటలు మరియు సామాజిక వివక్ష కారణంగా ఒక బలమైన రాజకీయ శక్తి కుప్పకూలడం కార్యకర్తలకు ఆందోళన కలిగించే అంశం. హరి నాయక్ రాజీనామా కేవలం ఒక వ్యక్తి నిష్క్రమణ కాదు.. అది పార్టీలో పేరుకుపోయిన అసంతృప్తికి పరాకాష్ట.





# జిల్లా స్థాయి సీడ్స్, ఫర్టిలైజర్ టాస్క్ ఫోర్స్ సమావేశం

- హాజరైన జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్
- నకిలీ, విత్తనాలు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు
- పీడీ యాక్ట్ సైతం నమోదు చేస్తామని హెచ్చరికలు
- సేంద్రియ వ్యవసాయం వైపు రైతులు మొగ్గు చూపేలా కృషి చేయాలి
- జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్

**మహబూబాబాద్, మే14(ప్రభాత గమనం):**

గురువారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్, జిల్లాలోని సొసైటీ చైర్మన్లు, వ్యవసాయ శాఖ, సీడ్స్ అండ్ ఫర్టిలైజర్స్ టాస్క్ ఫోర్స్ కమిటీ, డీలర్స్ షాపు యజమానులతో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, ఎరువులు, ఫర్టిలైజర్ వినియోగం, వాడకం, సరఫరా పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీలు 76, ఆగ్రోస్ రైతు కేంద్రాలు 47, హాక 14, ఓడిఎమ్మెస్ 10, ప్రైవేటు రిటైల్స్ షాపులు 530, మొత్తం 677 ల ద్వారా జిల్లాలోని రైతులకు ఎరువులను సీడ్స్ ను అందించడం జరుగుతుందని అందుకు తగిన ఏర్పాట్లు చేశామని తెలిపారు. జిల్లాలో 4,53,475 ఎకరాలలో ప్యాడి, కాటన్, మిర్చి, మక్కజొన్న, తదితర పంటలు ఉన్నాయని, వానాకాలం 2026 సీజన్ కి సంబంధించి యూరియా, 36026.4, డిఏపి 6092.4, ఎంవోపి 1282.6, ఎస్ఎస్పీ 851.07, ఎన్పికే24776.2, రైతులకు అందించడం కోసం జిల్లా యంత్రాంగం ప్రణాళికలు సిద్ధం చేసుకున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఇతర పంటల వైపు మొగ్గు చూపే విధంగా చర్యలు తీసుకోవాలని అందుకు అవగాహన కల్పించాలని ముందుగా సొసైటీ చైర్మన్లు, డైరెక్టర్లు ఆదర్శంగా తీసుకొని ఇతరులకు దారి చూపాలని కలెక్టర్ తెలిపారు, మిల్లెట్స్, ఆయిల్ పామ్, ఇతర వాణిజ్య పంటలు వేస్తే రైతులకు అధిక లాభాలు వస్తాయని, ఆ విధంగా డీలర్లు సైతం వారికి అవగాహన కల్పించాలని అన్నారు, అధిక యూరియా వాడితే నేల సారవంతం పోతుందని తద్వారా రైతులకు నష్టమని, వివరంగా చెప్పాలన్నారు, నానో యూరియా పై ప్రత్యేక దృష్టి పెట్టి ముందుకు సాగాలని తెలిపారు. అనంతరం ఎస్పీ డాక్టర్ శబరిష్ మాట్లాడుతూ..జిల్లాలో కల్తీ ఎరువులు విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుని పిడి యాక్ట్ నమోదు చేస్తామని, కావున అది గమనించి ప్రతి ఒక్కరూ నాణ్యమైన ప్రభుత్వం గుర్తించిన విత్తనాలు ఎరువులు మాత్రమే విక్రయించాలని సూచించారు. నకిలీ ఎరువులు విత్తనాల నివారణ నిమిత్తం జిల్లాలో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేశామని, ఇన్స్పెక్టర్ స్థాయి అధికారి నేతృత్వంలో ఈ కమిటీ విస్తృతంగా తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు, ఏదైనా నకిలీ విత్తనాల ఎరువుల సమాచారం ఉంటే నేరుగా ఇన్స్పెక్టర్ హతిరామ్ 8712656920 నెంబర్లు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుదామని ఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొన్న వారికి అగ్రికల్చర్ ఏవోలు జావేద్, ఛాయా రాజ్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎరువులు, విత్తనాల వాడకం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె. అనిల్ కుమార్, వ్యవసాయ శాఖ అధికారిని సరిత, డి సి ఓ వెంకటేశ్వర్లు, అన్ని విభాగాల సంబంధిత అధికారులు, సొసైటీ చైర్మన్లు, వ్యవసాయ శాఖ అధికారులు, సీడ్స్ ఫర్టిలైజర్ షాపులు యజమానులు, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.



# ఏసీబీకి చిక్కిన ఆర్ఐ

- దుగ్గొండి తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు..
- వారసత్వ భూమి వ్యవహారంలో రూ.10 వేల లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖకు దొరికిన ఆర్ఐ

**దుగ్గొండి మే14(ప్రభాత గమనం):**

దుగ్గొండి తహసీల్దార్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు గురువారం ఆకస్మిక దాడులు నిర్వహించారు.వారసత్వ భూమికి సంబంధిత ఫైల్ పరిష్కారం కోసం రూ.10 వేల లంచం తీసుకుంటున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆర్ఐ ను ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మండలంలోని మధిర గ్రామానికి చెందిన లొల్లాటి రాజు తన తండ్రి నర్సయ్య మరణంతో తన తండ్రి పేరు మీద ఉన్న 27 గుంటల వ్యవసాయ భూమి పట్టా చేసుకునేందుకు వారసత్వ భూమి నమోదు ప్రక్రియ కోసం దరఖాస్తు చేసుకోగా, సంబంధిత ఫైల్‌ను ముందుకు జరిపేందుకు ఆర్ఐ రూ.10 వేల లంచం డిమాండ్ చేశారు. బాధితుడు ఈ విషయాన్ని ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో వారు పక్కా ప్రణాళికతో డబ్బులు తీసుకుంటుండగా పట్టుకున్నారు. తహసీల్దార్ కార్యాలయంలోనే లంచం తీసుకుంటున్న సమయంలో అధికారులు ఆర్ఐను అదుపులోకి తీసుకుని, నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కార్యాలయంలో పలు రికార్డులను పరిశీలించి, సంబంధిత పత్రాలను సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ ఘటనతో తహసీల్దార్ కార్యాలయంలో ఒక్కసారిగా కలకలం రేగింది. ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# కొనుగోలు కేంద్రాల్లో కలెక్టర్, ఎస్పీ తనిఖీలు

- కొనుగోళ్ల నిర్వహణలో మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లకు బాధ్యతలు అప్పగింత
- క్షేత్రస్థాయిలో రైతులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు
- అదనపు హమాలీల నియామకం, వాహనాల ద్వారా ధాన్యం తరలింపు
- నిత్యం అదనపు కలెక్టర్, పౌరసరఫరాలు, రెవెన్యూ పోలీస్ శాఖల సమన్వయంతో పర్యవేక్షణ

**మహబూబాబాద్, మే14(ప్రభాత గమనం):**

వరి, మొక్క జొన్న కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, నెల్లికుదురు మండలం ఆలేరు గ్రామంలోని మణికంఠ రైస్ టెండర్స్ (రైస్ మిల్లును) మునిగలవీడు, నెల్లికుదురు గ్రామాలలో ఏర్పాటు చేసిన వరి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ తో కలిసి గురువారం ఆకస్మికంగా సందర్శించారు.

ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ, లోడింగ్, లిఫ్టింగ్ తదితర పనుల పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. లోడింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని, అందుకు అవసరమైన లారీలు, హమాలీలను తగిన సంఖ్యలో ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఆలస్యం లేకుండా కాంటా వేసి మిల్లులకు తరలించే చర్యలు చేపట్టాలన్నారు. రైతులు తమ పంటను విక్రయించే సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా అవసరమైన అన్ని సౌకర్యాలు కొనుగోలు కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని తెలిపారు. తేమ శాతం, నాణ్యత ప్రమాణాల పరిశీలనలో పారదర్శకత



పాటించాలని సూచించారు. నెల్లికుదురు నిర్వహిస్తున్న మొక్కజొన్న సేకరణ కేంద్రాన్ని సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. లారీలోడింగ్ పనులను దగ్గరుండి పరిశీలించారు. మిగిలి ఉన్న మొక్కజొన్నను వెంటనే సేకరించేలా తగిన సంఖ్యలో హమాలీలను ఏర్పాటు చేయాలని, అలాగే సేకరించిన ధాన్యాన్ని కేటాయించిన గోదాములకు తరలించేందుకు అవసరమైన వాహనాలను అందుబాటులో ఉంచాలని జిల్లా రవాణా శాఖ అధికారి,డిఏం మార్క్ఫెడ్, సివిల్ సప్లై, సహకార శాఖ, అన్ని విభాగాల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ట్యాబ్ ఎంట్రీలను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. రాబోయే వర్షాలను దృష్టిలో ఉంచుకుని వరి, మొక్కజొన్న నిల్వలో ఎటువంటి నష్టం జరగకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని, ధాన్యాన్ని భద్రపరిచేందుకు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. ప్రతి కొనుగోలు వరి ధాన్యం, మక్క జొన్న కేంద్రానికి అన్ని విభాగాలకు సంబంధించి ఒక డెడికేషన్ అధికారి నియమించారు. ఇప్పటికే రైస్ మిల్లర్లు, వాహనాల కాంట్రాక్టర్స్, పోలీస్, రెవెన్యూ ,వ్యవసాయ, పౌరసరఫరాల, రవాణా, అన్ని సంబంధిత శాఖలతో సమీక్షలు సమావేశాలు నిర్వహిస్తూ ఎక్కడ లోపాలు, ఇబ్బందులు రాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించడం జరిగింది. ఈ పర్యటనలో మండల ప్రత్యేక అధికారి జి.మరియన్న, డిసివో వెంకటేశ్వర్లు,డిసిఎస్ఓ రమేష్,డిఎంఎస్ నరసింహారావు,ఎంఎస్ఓ, తహసీల్దార్, ఎంఏవో,ప్యాక్స్ సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by PANDULA RAVICHANDER at .H NO 1-67/16/B/R NTR NAGAR COLONY KESAMUDRAM VILLEGE, MAHABUBABD, TELANGANA, 506101, Editor. P. Ravichander. email:www.prabhatagamanam.com * RNI NO.TELTEL/2022/83842* CELL : 7780470374